# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 18 మార్చి, 2026 | పేజీలు :08


## గ్రామ సమాఖ్య భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గ్రామ సమాఖ్య భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం ముస్కానిపేట గ్రామంలో గ్రామ సమాఖ్య భవన నిర్మాణ పనులను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనులు ఎప్పుడు మొదలు పెట్టారో ఆరా తీశారు. కావలసిన కార్మికులు, సామగ్రి సిద్ధం చేసుకోవాలని, భవన నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. మండలంలో మంజూరు అయిన అంగన్వాడీ కేంద్రాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని, అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. టాయిలెట్ల నిర్మాణాలు సైతం నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. జన గణనలో భాగంగా ఇండ్ల గణనకు చేస్తున్న ప్రక్రియపై ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ తదితరులు ఉన్నారు.

# ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

**ప్రజాపక్షం/కరీంనగర్:** వివిధ శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు భద్రతా చర్యలు తీసుకుంటూ ప్రమాదాలు నివారించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే చోట్లను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో, రహదారుల్లో రోడ్లు, డ్రైనేజీలు మరమ్మతులు సమయంలో వాహనదారులు గుర్తించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొన్ని పనులు దీర్ఘకాలం పాటు జరిగే అవకాశం ఉన్నందున అక్కడ వాహన ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదాల్లో బాధితులకు తక్షణ వైద్య సాయం అందేలా ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజాపాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అరైవ్అలైవ్ పేరుతో రోడ్డు భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అందువల్ల అధికారులు రోడ్డు భద్రతపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రమాదకర మలుపులు, సిగ్నలింగ్ పై దృష్టి సారించాలని, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో 24 ప్రమాదాలు ఎక్కువగా జరిగే చోట్లు ఉన్నాయని తెలిపారు. హెచ్చరిక బోర్డులు, రోడ్డు వైపు పెరిగిన కొమ్మలు కత్తిరించడం తదితర చర్యల ద్వారా ప్రమాదాలు నివారించాలని సూచించారు. నగరంలో బ్లికింగ్ బల్బులు, జంక్షన్లలో సిగ్నలింగ్, లైటింగ్ వ్యవస్థ కు సంబంధించి పలు సూచనలు చేశారు.




జగిత్యాల రోడ్డుకు ఇరు ప్రక్కల పొదలు, కొమ్మలను తొలగించడం ద్వారా ప్రమాదాలను నివారించగలమని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఆర్టిఏ కమిటీ మెంబర్ పడాల రాహుల్, రోడ్లు భవనాల శాఖ ఈఈ నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

**మాధకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత:** మాధకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమిష్టి కృషితో డ్రగ్స్ రహిత కరీంనగర్ గా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో మాధకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కాన్షియస్ నెస్ క్లబ్బులు చురుగ్గా పనిచేసే విధంగా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని పలు సంక్షేమ శాఖ అధికారులను కూడా డ్రగ్స్ నివారణ కార్యక్రమాల్లో, సమావేశాలు భాగస్వాములను తెలిపారు. యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రగతి ప్రణాళికలను డ్రగ్స్ నిర్మూలన ఒక ముఖ్యమైన అంశమని తెలిపారు. అందుకు తగిన రీతిలో కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలోని యాంటీ డ్రగ్ కమిటీలు చురుగ్గా పనిచేస్తున్నాయని తెలిపారు. వివిధ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామని అన్నారు. ప్రజా రవాణా ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ డ్రగ్స్ నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిషేధిత ఇంజక్షన్లు, టాబ్లెట్లు వినియోగించినా, సరఫరా చేసిన బాధ్యులపై క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. జిల్లాలో గత రెండు నెలల్లో డ్రగ్ సంబంధిత కేసులు 3 నమోదు కాగా ఆరుగురిని అరెస్టు చేశారు. 578 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, నెంబర్లు రాజేంద్రప్రసాద్, కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో
## వేగం పెంచాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, గ్రామ సమాఖ్య, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, టాయిలెట్ల నిర్మాణాలపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈ పీఆర్, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకునేలా సహకారం అందించాలని సూచించారు. తుది దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఈ నెల ఆఖరున మెగా గృహ ప్రవేశ కార్యక్రమానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. వడ్రంగి, ప్లంబర్, మేస్త్రి ఇతర ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఆర్డీఓ గీత, హౌసింగ్ డీఈ సాజిద్, సుదర్శన్ రెడ్డి, చందుర్తి మండల ప్రత్యేక అధికారి, పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరి
## ప్రత్యేక పూజలు

ప్రజా పక్షం/వేములవాడ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మంగళవారం భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి కోడెమొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి వేములవాడ ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ పూజారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు మంత్రి లక్ష్మ ణ్ కుమార్ కు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం బద్ది పోచమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ జయంత్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ఎడ్ల శివసాయి, వేద పండితులు పాల్గొన్నారు.



## నీటి ట్యాంకుల నిర్మాణ పనులను
## వేగవంతం చేయాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/నస్పూర్ :** అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న నీటి ట్యాంకుల నిర్మాణం, పైప్ లైన్ల ఏర్పాటు పనులను మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు నిరంతరంగా తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అనంతరం నస్పూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న బాల సదనం భవన నిర్మాణ పనులను కలెక్టర్ సందర్శించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య నిధులు 1 కోటి 34 లక్షల రూపాయలతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. భవన నిర్మాణ పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వల్భాపూర్‌లో పంచాయతీ అధికారి విచారణ

**ప్రజాపక్షం/వీణవంక:** వీణవంక మండలం వల్భాపూర్ గ్రామానికి చెందిన కామిడి శ్రీనివాస్‌రెడ్డి ఇంటి నిర్మాణానికి గ్రామ పంచాయతీ నుంచి అనుమతి పొంది సీడ్స్ గోడౌన్ నిర్మిస్తున్నారని అదే గ్రామానికి చెందిన బావు రాకేష్‌తో పాటు మరికొంతమంది ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ గ్రామ పంచాయతీ ఆవరణలో బహిరంగ విచారణ జరిపి నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి పంపనున్నట్లు విచారణాధికారి శ్రీనివాస్ తెలిపారు. కాగా విచారణకు కార్యదర్శి గైర్హాజరయ్యారు. వల్భాపూర్ గ్రామ వాసి శ్రీనివాస్‌రెడ్డికి ఇంటి నిర్మాణానికి గ్రామ పంచాయతీ ధృవీకరణ జారీ చేశారు. విచారణకు హాజరైన విచారణాధికారి శ్రీనివాస్ ఎందుకు హాజరు కాలేదని కారోబార్‌ను ప్రశ్నించగా ఆరోగ్యం బాగా లేదని ఆస్పత్రికి పోయినట్లు తనకు మెసేజ్ చేసినట్లు కారోబార్ తెలిపారు. ఈ విచారణలో మండల పంచాయతీ అధికారి సురేందర్, గ్రామ సర్పంచ్ అంది శ్రీమతి, ఉపసర్పంచ్ నామని విజేందర్‌లతో పాటు గ్రామస్తులున్నారు.



## లయన్స్ ఆసుపత్రిని సందర్శించిన బ్యాంకు ప్రతినిధి

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** ఐడిబిఐ అధికారి మంగళవారం రేకుర్తి లయన్స్ కంటి దవాఖానాను సందర్శించారు. మొహమ్మద్ అన్వర్ హుస్సేన్ సిఎస్ఆర్ ముంబై నుంచి కంటి ఆసుపత్రి వచ్చి పరిసరాలను కలియతిరిగారు. ఐడిబిఐ బ్యాంకు నుంచి సిఎస్ఆర్ గ్రాంట్ ద్వారా డొనేట్ చేసిన రూ.74.08,700 ఖర్చు చేసిన విధానం గురించి పరిశీలించి సంతృప్తి చెందారు. భవిష్యత్తులో రేకుర్తి కంటి ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. సిఎస్ఆర్ గ్రాంట్ ద్వారా వైద్య, విద్య గురించి సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, ట్రస్టు సభ్యులు కోల అన్నారెడ్డి పాల్గొన్నారు.

## సెయింట్‌జార్జి ఇంటర్నేషన్ స్కూల్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల సిబిఎస్ఇ వేదికగా ప్యారడైజ్, సెయింట్ జార్జ్ ముస్లిం అధ్యాపక బృందానికి, సిబ్బందికి విద్యాసంస్థల యాజమాన్యం ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డా.పి.ఫాతిమారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ మన పాఠశాల ఒకే కుటుంబమని, అన్ని పండుగలను కలిసి జరుపుకోవడం వల్ల సోదరభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో పాటించే ఉపవాదీక్షలు క్రమశిక్షణకు ప్రతీక అని కొనియాడారు. అనంతరం అందరూ కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందును ఆరగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్స్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో వివిధ క్రీడలలో జిల్లాస్థాయికి ఎంపిక

**ప్రజాపక్షం/వీణవంక:** 2026– 27 విద్యాసంవత్సరానికి క్రీడా పాఠశాలకు అర్హులైన విద్యార్థులకు క్రీడలు నిర్వహించి విజేతలను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు వీణవంక ఎంఈవో ఎస్.శోభారాణి తెలిపారు. మంగళవారం వీణవంక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన మూడో తరగతి చదువుతున్న విద్యార్థులకు వివిధ అంశాలలో క్రీడలు నిర్వహించి జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు వి.శాంతా, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలు తడి, పొడి చెత్త వేరు చేయాలి



**ప్రజాపక్షం/వేములవాడ:** ప్రజల సహకారంతోనే పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడం సాధ్యమవుతుందని, పట్టణాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేందుకు ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను తప్పనిసరిగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేములవాడ మండలం తెట్టెకుంట శివారులో వేములవాడ మున్సిపాలిటీకి సంబంధించిన పొడి వనరుల సేకరణ కేంద్రంలో నూతనంగా సమకూర్చిన యంత్రాలను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 6వ తేదీ నుంచి మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణాల్లో చెత్త సేకరణ, చెత్త నిర్వహణను మరింత సమర్థవంతంగా చేసేందుకు పలు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొక్కుల బాలకృష్ణ, అన్నారం శ్రీనివాస్, తూమ్ మధు, ఎల్ల శ్రీనివాస్, తోట రాజు, కాషా శ్రీనివాస్, మూడపల్లి నీలమ్మ, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 18 శాతం నిధులు కేటాయిస్తారని తన మేనిఫెస్టోలో పేర్కొందని, త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ డిటిఎఫ్ జిల్లా శాఖ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం నిధులు కేటాయించి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయున్ని, ప్రతి తరగతికి ఒక గది ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. జీవో నెంబర్ 25ను రద్దు చేసి ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తితో సంబంధం లేకుండా ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయున్ని కేటాయించాలన్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గంపగుత్తగా విద్యార్థుల సంఖ్య ప్రకారం కాకుండా తరగతిలో 30 మందికి ఒక సెక్షన్‌గా పరిగణించి అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లను కేటాయించాలన్నారు. డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హుమేరా జబీన్, తాళ్లపల్లి తిరుపతి, శ్రీరామ్ చక్రధర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తూముల తిరుపతి, కానుగంటి రాజమౌళి, ఎం.సదానందం, జిల్లా కార్యదర్శులు అమిరిశెట్టి దామోదర్, రాకం శంకర్ ,ఆడిట్ కమిటీ సభ్యులు, ఉయ్యాల శంకర్, రవి తదితరులున్నారు.

## కల్వల ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** కరీంనగర్ జిల్లాలో మానకొండూర్, హుజురాబాద్ నియోజకవర్గాలలో కల్వల ప్రాజెక్టు మత్తడి కొట్టుకుపోయి మూడ్లే కావస్తున్నా మరమ్మతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగృతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్ఎండి కాలనీలోని జిల్లా ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కల్వల ప్రాజెక్టు మత్తడికి మరమ్మత్తులు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు, వ్యవసాయం పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వారిని గాలికొదిలేశారన్నారు. సాగునీటి కోసం ఉపయోగకరంగా ఉన్న కల్వల ప్రాజెక్టు మత్తడి కొట్టుకుపోయి మూడేళ్లయినా మరమ్మత్తులు చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తూ ఎటువంటి చర్యలు చేపట్టకుండా రైతుల నోట్లో మట్టికొడుతోందన్నారు. ఈ రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రైతులను పూర్తిగా పట్టించుకోకుండా తమ రాజకీయ పబ్బం గడుపుకుంటూ అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారన్నారు. వీణవంక, శంకరపట్నం మండలాల పరిధిలో అనేక గ్రామాల రైతుల పొలాలకు సాగునీరు అందించే ఏకైక ప్రాజెక్టు కల్వల ద్వారా అనేక ఎకరాలలో తమ పంటలను సాగుచేసే అవకాశముందన్నారు. ఇప్పటికైనా కల్వల ప్రాజెక్టును మరమ్మత్తు చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ మండల జాగృతి నాయకులు బుడిగె పర్శరాం , జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, నాయకులు లక్ష్మణ్ ,శ్రీనివాస్ తదితరులున్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల 48 గంటల నిరవధిక దీక్ష శిబిరానికి మద్దతు ప్రకటించి మాట్లాడారు. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఆశ వర్కర్లకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశ వర్కర్ల వేతనాలు పెంచుతామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా అనేక హామీలు నేటికీ అమలు కాలేదన్నారు. నేటికీ వేతనాలు పెంచలేదన్నారు. జిల్లాలో ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాలుగా గ్రామీణ పేదలకు వైద్య సహాయం అందిస్తున్నారన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో నెలకు రూ.18 వేల వేతనం నిర్ణయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## శ్రీరుద్ర సహిత మహానవ చండీయాగం

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ నగరంలోని 4వ డివిజన్ దుర్శేడ్‌లో శ్రీ విశ్వంభరీ పీఠం భాగ్యనగరం ఆధ్వర్యంలో శ్రీమరకత లింగ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో శ్రీరుద్ర సహిత మహానవ చండీ యాగంలో మొదటి రోజు శ్రీమహాగణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, బ్రాహ్మణ రుత్విక్వరణం, అవాహిత మంటప పూజలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాలయ చిత్రపట, శేష వస్త్రముల ఆవిష్కరణ జరిపారు. దేవాలయ చైర్మన్ నందాల తిరుపతి, 4వ డివిజన్ కార్పోరేటర్ భూపతి రవీందర్, మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, దేవాలయ అర్చకులు దేవరాజు ప్రశాంత్ శర్మ, వర్గల్ దేవాలయ ప్రధాన అర్చకులు దేవరాజు ప్రవీణ్ శర్మ, భక్తులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బొంకూరి నరేష్ అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తన ట్రాక్టర్‌లో రవాణా చేస్తుండగా తీగలగుట్టపల్లిలోని రైల్వే గేట్ వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. రేకుర్తి గ్రామానికి చెందిన పర్వతం శ్రీకాంత్, అతని యజమానికి నూనె సారయ్య అనే వ్యక్తి తమ అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా మొగ్దుంపూర్ గ్రామం వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. చేగుర్తి గ్రామానికి చెందిన ఎలుకపెల్లి నవీన్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా బొమ్మకల్‌లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వాహనాలు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపించినట్లు కరీంనగర్ రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై సస్పెక్ట్ షీట్లు తెరిచి సీజ్ చేసిన వాహనాలను కోర్టు ద్వారా వేలం వేయడం గురించి ప్రభుత్వానికి అప్పజెప్పినట్లు పేర్కొన్నారు.

## విబి జీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండల కేంద్రంలోని ఎలగందుల గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విబి జి రామ్‌జి చట్టాన్ని తీసుకువచ్చి కార్మికుల నడ్డి విరిచే విధంగా ఆ చట్టం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేసి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎలగందుల గ్రామంలో బోనాలపల్లె నుంచి చందమామ కుంట వరకు నాలుగు కిలోమీటర్ల నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉందని, వారికి ఆటో చార్జీ చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో వాటర్, టెంట్, మెడికల్ కిట్లు, సదుపాయాలు కల్పించాలన్నారు.
గత 15 రోజుల నుంచి కూలీ డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత బకాయిలు వెంటనే విడుదల చేయాలని, రాబోయే రోజుల్లో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ద్వితీయ బహుమతి

ప్రజాపక్షం/మల్లాపూర్ : జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలుగు టాలెంట్ టెస్ట్‌లో ఆదర్శ పాఠశాలకు చెందిన బెజ్జారపు సాహితి 9వ తరగతి విద్యార్థి ద్వితీయ బహుమతి సాధించి ప్రతిభను చాటారు. కాగా పాఠశాల ప్రిన్సిపల్ భూమేష్ విద్యార్థిని సాహితిని అభినందించి పట్టుదలతో పాఠశాలకు గౌరవాన్ని తీసుకొచ్చిందని అభినందించారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికలు




ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి బార్ అసోసియేషన్ 202627 సంవత్సరానికి సంబంధించిన ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు మంగళవారం అత్యవసర ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ కోసం సీనియర్ న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, ఏలేటి శ్రీనివాస్ రెడ్డి, పుప్పాల భాను మూర్తిలను ఎన్నికల అధికారులుగా నియమించినట్లు తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించామని వెల్లడించారు.ఎన్నికలు బార్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఎన్నికల అధికారులకు సూచించినట్లు తెలిపారు. సంబంధిత నియామక పత్రాలు మరియు ఓటరు జాబితా వారికి అందజేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తోగిటి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి గజెల్లి రాందాస్, కోశాధికారి పడిగేల శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శి పులి నర్సయ్య, మహిళా ప్రతినిధి ఆకుల మానసతో పాటు సభ్యులు అలాల సత్యనారాయణ, కట్టా నర్సాగౌడ్, ఓగులపు శేఖర్, గజ భీంకర్ వెంకటేష్, మన్నె గంగాధర్,గురిజెలా గోపి పాల్గొన్నారు.



## పోలీస్ స్టేషన్‌లో పారిశుద్ధ్య కార్యక్రమం

ప్రజాపక్షం/మెట్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈరోజు మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిఐ అనిల్ కుమార్, ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. స్టేషన్ పరిసరాల్లో పెరిగిన పిచ్చి గడ్డిని తొలగించి, ఆవరణను పూర్తిగా శుభ్రపరిచారు. అనంతరం సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా తరలించారు. ఈ కార్యక్రమంలో సానిటేషన్ ఇంచార్జ్ ముజీబు, పోలీస్ సిబ్బంది సత్యనారాయణ, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

# జనగణనపై పూర్తి అవగాహనతో ముందుకెళ్లాలి





ప్రజాపక్షం/కరీంనగర్ : జనగణ2027 కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని స్పష్టమైన అవగాహనతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు. 2027 జనగణన పై అధికారులకు కలెక్టరేట్ లోని మర్రి చిన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఈనెల 15 నుండి చార్జ్ ఆఫీసర్లు, అదనపు ఛార్జ్ అధికారులు, జిల్లా అదనపు సెన్సెస్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మంగళవారం హాజరైన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జన గణన కోసం సూచించిన ఆప్ రిజిస్ట్రేషన్, పనితీరు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు వస్తుంటాయని, ఉన్నతాధికారులను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకొని పకడ్బందీగా సర్వే నిర్వహించాలని అన్నారు. టెక్నికల్ అంశాలు, నియమ నిబంధనలు స్పష్టంగా తెలుసుకోవాలని, నవీకరించిన మార్గదర్శకాలను పాటించాలని అధికారులకు సూచించారు. శిక్షణ ఇచ్చేవారు అధికారుల సందేహాలు నివృత్తి చేయాలని, ప్రతి అంశంపై క్షుణ్ణంగా వివరించాలని తెలిపారు. మండల చార్జ్ అధికారులుగా తహసిల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా నాయబ్ తహసిల్దార్లు, పట్టణ చార్జ్ అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, అదనపు ఛార్జ్ అధికారులుగా టౌన్ ప్లానింగ్ అధికారులు, జిల్లా అదనపు సెన్సెస్ అధికారులుగా పలువురు జిల్లా స్థాయి అధికారులు శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, సిపిఓ రామ్ దత్తారెడ్డి తదితరులు ఉన్నారు.

# గంజాయితో పట్టుబడ్డ ఇరువురు అరెస్ట్



ప్రజాపక్షం/ధర్మపురి : నిషేధిత గంజాయితో పట్టుబడ్డ ఇరువురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ధర్మపురి ఎస్సై గురుక మహేష్ తెలిపారు.ఎస్సై కథనం మేరకు వివరాలిలాఉన్నాయి.జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నంకు చెందిన నలిమెల విష్ణు (21) అక్రమ గంజాయి కొనుగోలు చేయడానికి మంచిర్యాల జిల్లా ల క్షెట్టిపేట కు చెందిన కండ్ల ప్రదీప్ (32)కు కబురుపెట్టాడు. సోమవారం రాత్రి ప్రదీప్ గంజాయి తీసుకుని రాయపట్నం హనుమాన్ విగ్రహం వద్దకు చేరుకోగా వి శ్వసనీయ సమాచారం మేరకు ధర్మపురి పోలీసులు ఇరువురినీ పట్టుకున్నారు. నిందితులకు పంచనామా జరిపి వారివద్ద లభించిన 100 గ్రాముల గంజాయిని, సెల్ ఫోన్ ను స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై చెప్పారు. అనంతరం నిందితులను ధర్మపురి పోలీసుస్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

# అంతర్జాతీయ విషయాలపై అవగాహన పెంపొందించాలి

### జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ లత



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : విద్యార్థులకు అంతర్జాతీయ విషయాలపై అవగాహన పెంపొందించాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ , జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంతార్జాతీయ విషయాలపై అవగాహన పెంపొందించేందుకు గాను నమూనా ఐక్యరాజ్య సమితి కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ లత హాజరై మాట్లాడుతూ వనరులపై ఆధిపత్యం కోసమే అనేక యుద్ధాలు జరిగాయని ప్రస్తుతం కూడా చమురుపై ఆధిపత్యం కోసమే యుద్ధం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా విద్యార్థులు కృషి చేయాలని కోరారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజ గౌడ్ మాట్లాడుతూ ప్రపంచ శాంతిని కాపాడడంలో అంతర్జాతీయ సంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాము, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు చంద్ర శేఖర్ రెడ్డి, సత్యనారాయణ, నీరజ, మహేష్, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు జోగ రవి, కార్యదర్శి దాసరి రామస్వామి, ఉపాధ్యాయులు బోనగిరి దేవయ్య, కొమురయ్య, మహేష్, జక్కుల రవి, అజీమ్, పద్మ, సతీష్ తదితరులు ఉన్నారు.

# మైనారిటీలకు రంజాన్ తోఫా ఇవ్వాలి

### జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

ప్రజాపక్షం/జగిత్యాల : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మైనారిటీలకు రంజాన్ తోఫా ఇవ్వడం లేదని తక్షణమే ప్రతి కుటుంబానికి ఇవ్వాలని జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. మంగళవారం వసంత విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో ప్రతి ఏడాది మైనారిటీలకు రంజాన్ కానుకలు ఇచ్చామని గుర్తు చేశారు. హిందూ మహిళలకు బతుకమ్మ చీరెలు, ముస్లీంలకు తోఫా, క్రిస్టియన్లకు క్రిస్మస్ కానుకలు అందించి ఆచారాలను గౌరవించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. జగిత్యాల నియోజక వర్గంలో గత పాలనలో 4వేల తోఫాలు ఇచ్చామని రంజాన్ మాసం ముగుస్తున్నా ఇప్పటికి తోఫాలు ఇవ్వకపోవడం బాధకరమన్నారు. గతంలో ఆడబిడ్డ పెళ్లికి కళ్యాణ లక్ష్మి పథకం కింద రూ. 1,16,000 అందించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని గుర్తించిన కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా 204 మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేశారన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ఐల్నేని వెంకటేశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

## రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు, కిట్ల పంపిణీ



ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం : జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ రైతు వేదికలో మంగళవారం డబ్బా గ్రామ రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాస్త్రవేత్తలు సహజ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. రసాయనాల వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని, రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. అనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు, ఫార్మర్ కిట్ల ను వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాల సర్పంచుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్ కుమార్, ఏఈవోలు సాయి కృప, ప్రవళిక, సర్పంచ్‌లు పుప్పాల లక్ష్మి ,పోన్ కంటి చిన్న వెంకట్, రైతులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ దేవాలయంలో హుండీ లెక్కింపు

### రూ.39,566 ఆదాయం

ప్రజాపక్షం/మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వెల్లుల గ్రామంలో నీ శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదాయ లెక్కింపు నిర్వహించారు. దేవాలయంలో వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.32,350 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హుండీలను తెరిచి లెక్కించగా రూ.7,216 వచ్చినట్లు వెల్లడించారు. ఇవి కలిపి మొత్తం ఆదాయం రూ.39,566 నమోదైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు ఎం. రాజా మొగిలి, డిప్యూటేషన్ సిబ్బంది కల్వకుంట్ల అనిల్ రావు, కూకట్ల రాజేందర్, గుంటుక శివ, కేశవ్, మ్యత నర్సవ్వ పాల్గొన్నారు.మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో మెట్‌పల్లి పోలీస్ శాఖ సిబ్బంది ట్రాఫిక్ సమస్యలు లేకుండా పర్యవేక్షించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ కార్యనిర్వహణ అధికారి కె. కాంత రెడ్డి తెలిపారు.

## రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాపక్షం/జగిత్యాల : రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లోని మౌంట్ కార్మెల్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న జి. శివాణి అ నే విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్యోతిస్వరియ పేర్కొన్నారు. శివాణి ఇటీవల జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో తన ప్రతిభను కనబరిచింది. దీంతో ఈ నెల 20 నుండి 22 వరకు హైదరాబాద్ వాక్సన్ యూనివర్శిటీ జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాస్కెట్ బాల్ పోటీలకు శివాణి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని మంగళవారం పాఠశాలలో సిస్టర్స్ రెజిన, లిల్లీ, రాణి, వ్యాయామ ఉపాధ్యాయులు చేని మంగ, పులి విజ్ఞాన్, సామంత్, ఇల్లందుల హరీష్ తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : పోలీస్ స్టేషన్ పరిసరాల ను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి పోలీస్ అధికారిపై ఉందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణల పరిశుభ్రత పై పోలీస్ అధికారులతో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మం గళవారం పోలీసుల ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టి పరిసరాలను పరిశుభ్రం చేశారు. పచ్చదనం పెంపులో భాగంగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, సిఐ కరుణాకర్ ఉన్నారు.

## పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన 15వ వార్డు కౌన్సిలర్

ప్రజాపక్షం/మెట్‌పల్లి : పట్టణంలోని 15వ వార్డు లో పారిశుద్ధ్య పనులను కౌన్సిలర్ అరిగెల అనూష–రాకేష్ పర్యవేక్షించారు. వార్డులో పరిశుభ్రత మెరుగుపరిచేందుకు చేపడుతున్న పనులను పరిశీలించి, మున్సిపల్ సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు.చెత్త తొలగింపు, కాలువల శుభ్రత పనులు నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు.ప్రజలు కూడా పరిశుభ్రతపై బాధ్యతగా వ్యవహరించి పరిసరాలను స్వచ్ఛంగా ఉంచాలని కౌన్సిలర్ కోరారు.

## పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛత కార్యక్రమం

ప్రజాపక్షం/గొల్లపల్లి : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి పోలీస్ సిబ్బంది సమిష్టిగా పాల్గొని పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రం పరిచారు.ఈ సందర్భంగా సిబ్బంది స్వయంగా శ్రమదానం చేస్తూ పోలీస్ స్టేషన్ లోపల వెలుపల ఉన్న చెత్త చెదారాన్ని తొలగించారు. స్టేషన్ ఆవరణలో అస్తవ్యస్తంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. స్టేషన్ లోని రికార్డులను కూడా క్రమ పద్ధతిలో సర్ది దుమ్ము ధూళి లేకుండా శుభ్రపరిచారు . అనంతరం ఎస్సై మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు .అలాగే ప్రజలు కూడా స్వచ్ఛతపై అవగాహన కలిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు .విధి నిర్వహణలో నిరంతరం బిజీగా ఉండే పోలీస్ సిబ్బంది సామాజిక బాధ్యతగా భావించి ఈ స్వచ్ఛత కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడం విశేషంగా నిలిచింది.

## యువత జాబ్ క్యాలెండర్ వెంటనే అమలు చేయాలి

ప్రజాపక్షం/ముత్తారం : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ గెలుపు మేరకు రాష్ట్రంలో అనేక హామీలు ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచి కూడా నెరవేర్చని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, యువత జాబ్ క్యాలెండర్ వెంటనే అమలు చేయాలి భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ముత్తారం మండలం తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రము ర్యాలీ గా వెళ్లి ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బిరుదు గట్టయ్య సీనియర్ నాయకులు మూగమళ్లేష్, ఐద రమేష్, దాసరి ప్రశాంత్, బియ్యాని శ్రీనివాస్,ఆకోజు నవీన్ చారి, పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ఇటీవల హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించిన గోదావరిఖని విద్యానగర్ కు చెందిన మర్రి ప్రశాంత్‌శ్రావణి కుమారుడికి 10,000 రూపాయలు సాయాన్ని మంగళవారం రోజున బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు దండే రవి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని అనాధ బాలుడ్ని దాతలు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాటన్ శంకర్ గౌడ్,దాసరిల్లన్న, దాసరి మొగిలి, పులి శేఖర్. ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, దండే యశ్వంత్ గౌడ్,కొప్పుల సుధీర్ కుమార్, ఎలకపల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# స్నాప్ చాట్ పలకరింపు ప్రాణం మీదకు వచ్చింది

ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : స్నాప్ చాట్ పలకరింపు ప్రాణం మీదకు వచ్చిన ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. సోషల్ మీడియా వేదికగా ప్రారంభం ఐన పలకరింపు చివరకు ప్రాణం మీదకు వచ్చింది.వివరాలు కొడిమ్యాల మండలానికి చెందిన ఓ యువతితో కరీంనగర్ జిల్లా కమాన్ పూర్ కు చెందిన అభిమన్యు అనే యువకుడితో స్నాప్ చాట్ లో పరిచయం ఏర్పడింది ఆ పరిచయం కాస్తా ఇంతింతా చాటంతై గత కొంతకాలంగా నిత్యం మాట్లాడుకుంటున్నారు. ఆ విషయం యువతి ఇంట్లో తెలియడంతో కుటుంబ సభ్యులు యువతికి గత రెండు రోజులుగా ఫోన్ ఇవ్వకుండా ఉండడంతో యువతిని కలవడానికి అభిమన్యు తన స్నేహితులతో కలిసి జగిత్యాల జిల్లా కేంద్రానికి రాగా యువతి తరపు బంధువులు వారిపై విచక్షణ కోల్పోయి తీవ్రంగా దాడి చేశారు.ఈ దాడి కాస్త పట్టణ పోలీసులకు తెలియడంతో ఘటనా స్థలానికి చేరుకుని దాడికి గురైన యువకులను పట్టణ పోలీసులు స్టేషన్ తరలించారు.

# బాల్య వివాహ రహిత గ్రామంగా బ్రాహ్మణపల్లి



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : మంగళవారం రోజున ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా బ్రాహ్మణపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన బాలల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో కమిషన్ ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తుందని తెలిపారు. బాల కార్మికులు, పాఠశాల విడిచిపెట్టిన పిల్లలు (డ్రాప్ అవుట్స్), చైల్డ్ ట్రాఫికింగ్ వంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బ్రాహ్మణపల్లి గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.దేశంలోనే బాల్య వివాహ రహిత గ్రామంగా ప్రకటించబడిన తొలి గ్రామంగా బ్రాహ్మణపల్లి గుర్తింపు పొందే అవకాశముందని తెలిపారు. ఈ ఘనత సాధించడానికి కృషి చేసిన అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీ వేణుగోపాల్ రావు ,జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ & సభ్యులు,జిల్లా బాలల పరిరక్షణ అధికారి, సీడీపీఓ (పెద్దపల్లి, మంథని), అదనపు DRDO, ఎంపీడీఓ,గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్,ఎంఈఓ,హెచ్ఎం మరియు గ్రామ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయికి ఎంపికైన కండ్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు



ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యాశాఖ తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం జగిత్యాల సంయుక్తంగా తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమం మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ హాల్ లో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రధాన అంశం ప్రపంచ శాంతి, న్యాయం, బలమైన గ్లోబల్ సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు నిర్వాహకులు సూచించిన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ పైన పేర్కొన్న అంశంపై వారి సందేశాన్ని ఇవ్వడం జరిగింది.తెలంగాణ మోడల్ స్కూల్ కండ్లపల్లి నుండి ముగ్గురు విద్యార్థులు చందన, గౌరీ, పూజ శ్రీ పాల్గొని దక్షిణ ఆఫ్రికా,నేపాల్,రష్యా దేశాలకు ప్రతినిధ్యం వహించారు.తెలంగాణ మోడల్ స్కూల్ కండ్లపల్లి నుండి ఇద్దరు విద్యార్థులు చందన, గౌరీ (9వ తరగతి ) రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు.రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్లు లత, రాజా గౌడ్, డీఈఓ రాము , సెక్టోరియల్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, సోషల్ ఫోరం అధ్యక్షుడు జోగ రవి ప్రశంసా పత్రాలు అందించారు.రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ సరిత దేవి, వైస్ ప్రిన్సిపాల్ నగేష్ అభినందించారు. విద్యార్థులను మార్గదర్శనం చేస్తున్న సోషల్ టీచర్స్ శ్రీనివాస్, మధుకర్, ప్రేమ్ సాగర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొత్త విధానంతో విద్యుత్ కనెక్షన్ సులభంగా పారదర్శకంగా...

ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి జారీ చేసిన రెగ్యులేషన్ నం. 1 ఆఫ్ 2026 ప్రకారం, విద్యుత్ వినియోగదారులకు మరింత సులభతరంగా పారదర్శకత కలిగించే విధంగా కొత్త సర్వీసుల కొరకు సర్వీస్ లైన్ ఛార్జీలు ( ఎస్.ఎల్.సి ) విధానాన్ని అమలులోకి తీసుకువచ్చామని జగిత్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం ఓ ప్రకటనలో తెలిపారు.సూపరింటెండింగ్ ఇంజనీర్ సుదర్శనం మాట్లాడుతూ కొత్త ఎల్.టి కనెక్షన్లులు, ఎల్.టి కోసం సర్వీస్ లైన్ ఛార్జీలను సరళంగా ఏకరీతిగా నిర్ణయించడం జరిగిందని ఆయన తెలిపారు. లోడ్ ఆధారంగా మాత్రమే ఛార్జీలు విధించడం జరుగుతుందని క్షేత్ర స్థాయిలో స్థల పరిశీలన అవసరం లేకుండా త్వరితగతిన కొత్త సర్వీసులు అందిస్తున్నామని వారు పేర్కొన్నారు. అనవసర ఆలస్యం పూర్తిగా తగ్గుతుందని వారు వివరించారు. కొత్త ఛార్జీలు ముఖ్యాంగా 20 కిలోవాట్ వరకు డెవలప్ మెంట్ ఛార్జీలు + సర్వీస్ లైన్ ఛార్జీలు వర్తింపు, 20 కిలోవాట్ పైగా కేవలం సర్వీస్ లైన్ ఛార్జీలు మాత్రమే (డెవలప్‌మెంట్ ఛార్జీలు లేవు) కేటగిరీ వారీగా ఛార్జీలు గృహ వినియోగదారులు ( ఎల్.టి I)1 కిలోవాట్ వరకు: 5001–5 కిలోవాట్: 500 + ప్రతి కిలోవాట్‌కు 600, 5–20 కిలోవాట్: 2900 + ప్రతి కిలోవాట్‌కు 1500, 20 కిలోవాట్ పైగా: ప్రతి కిలోవాట్‌కు 10,000, కమర్షియల్ కేటగిరీలో 1 కిలోవాట్ వరకు: 1000, 1–5 కిలోవాట్: 1000 + ప్రతి కిలోవాట్‌కు 1200, 20 కిలోవాట్ పైగా: ప్రతి కిలోవాట్‌కు 10,000, ఇతర కేటగిరీలకు కూడా లోడ్ ఆధారంగా ఛార్జీల పెరుగుదల ఉంటుందని సూపరింటెండింగ్ ఇంజనీర్ సుదర్శనం తెలిపారు.

## రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: ఉమ్మడి మండలంలోని ఎల్లారెడ్డిపేట,వీర్నపల్లి మండల కేంద్రాలతో సహా 300 మంది నిరుపేదల కుటుంబాలకు నూతన వస్త్రాలను మండల ముస్లీం మైనార్టీ కమిటి కార్యాలయంలో (ఈద్గాతోఫా)లను అందచేశారు. మంగళ వారం జహంగీర్, ఆయూబ్, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సద్దిలక్ష్మారెడ్డి, దొమ్మాటనర్సయ్య, షేక్‌గౌస్ చేత అందచేశారు. జిల్లా మైనార్టీ అద్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మర్రిశ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వంగగిరిధర్‌రెడ్డి, చెన్నిబాబు, బాలెర్డి, గుర్రాల రాజిరెడ్డి, రేషన్‌డీలర్ బాబా, షాబొద్దిన్, సొహెల్, రఫిక్, అఫ్జల్, తదితరులున్నారు. ముస్లీం సోదరులు రంజాన్ పండుగ సందర్భంగా సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ముస్లీం సోదరులు సీఎం రేవంత్‌రెడ్డికి, వక్ఫ్‌బోర్డు చైర్మెన్ అజ్మతుల్లా కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇండ్లపై నుండి వెళ్లే విద్యుత్ లైన్ల మార్పిడి

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి సెక్షన్ పరిధిలోని నందిపల్లి ,చిల్వాకోడూర్ సెక్షన్ పరిధిలోని అబ్బాపూర్ గ్రామాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గొల్లపల్లి సెక్షన్ పరిధి లోని నందిపల్లి గ్రామంలో ఇండ్ల మీదుగా వెళ్లే విద్యుత్ తీగలను మార్చేందుకు సుమారు రూ .4 లక్షల అంచనా వ్యయంతో పనులు మంజూరు చేసి విజయవంతంగా పూర్తి చేశారు .అలాగే మండలంలోని చిల్వాకోడూర్ సబ్ స్టేషన్ సెక్షన్ పరిధిలోని అబ్బాపూర్ గ్రామంలో సుమారు రూ.4 లక్షల అంచనా వ్యయంతో ఓవర్ లోడ్ ఉన్న డి టి ఆర్ పై అదనంగా 63 కెవిఎ గల నూతన ట్రాన్స్ఫార్మర్ ను అమర్చి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎస్ ఈ బొంకురి సుదర్శనం ఉప సర్పంచ్ ఎక్కల దేవి గంగన్న ఉప సర్పంచ్ చెవుల తిరుపతి ,లైన్మెన్ రమేష్ ,ఏఎల్ఎం శ్రీకాంత్,వార్డు సభ్యులు గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## భార్యపై పెట్రోల్ పోసి హత్యాయత్నం

ప్రజాపక్షం/ధర్మపురి : కుటుంబ కలహాలతో భార్యపై భర్త పెట్రోల్ పోసి హత్యాయత్నం చేసిన ఘటన ధర్మపురి పట్టణంలో కలకలం రేపింది. ధర్మపురి ఎస్సై గురుక మహేష్ కథనం మేరకు, ధర్మపురి పట్టణానికి చెందిన బదుగు నవీన్ (23) మండలంలోని తుమ్మెనాలకు గ్రామానికి చెందిన మసీదు రమ్య (22) లు నాలుగేళ్ల క్రితం ప్రేమించుకొని పెళ్లిచేసుకున్నారు.వివాహం జరిగిన కొన్ని నెలల తర్వాత ఇరువురి మధ్య అనేక విషయాలలో గొడవలు చోటుచేసుకున్నాయి.ఈ క్రమంలో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీ జరిగాయి.కాగా ఐదు నెలల క్రితం మళ్ళీ గొడవలు జరిగి ధర్మపురి లోనే నివాసముంటున్న తన తల్లి గారింట రమ్య ఉంటోంది.అప్పటి నుంచి భార్యపై కోపం పెంచుకున్న నవీన్ సోమవారం రాత్రి భార్య దగ్గరికివెళ్లి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ ను ఆమెపై పోసి నిప్పంటించాడు.తీవ్రంగా గాయపడ్డ రమ్యను స్థానికులు 108 అంబులెన్స్ లో జగిత్యాల కు తరలించారు. అనంతరం వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉందగా ఆమె తల్లి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్ కు తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## పథకాలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

ప్రజాపక్షం/పెద్దపల్లి : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రోజున తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి మండల తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాల విషయాలను తెలియపరుస్తూ ప్రభుత్వం నిరుద్యోగులకు యువతి యువకులకు హామీలను విస్మరించడం జరిగిందని అర్హులైన ఇల్లు లేని పేదలకు ఇల్లు మంజూరు చేయాలని వితంతు వృద్ధులకు పింఛన్లు రైతులకు రైతు భరోసా సన్నవడ్లకు బోనస్ సకాలంలో చెల్లించాలని రుణమాఫీ సంపూర్ణంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లకు 1,00,116/ లతో పాటు తులం బంగారం ఇవ్వాలని అర్హులైన మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు 2500/ చెల్లించాలని పత్రికా ముఖంగా ప్రభుత్వానికి తెలియపరుస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు తంగడ రాజేశ్వరరావు,పోల్సాని సంపత్ రావు,దాడి సంతోష్,మేకల శ్రీనివాస్,వోల్లే తిరుపతి,కందుల సదయ్య,మామిడి ఉమేష్,శిరాలపు మహేష్, రెండ్ల వేణు,తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులు దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రజాపక్షం/పెద్దపల్లి : జిల్లా ఆసుపత్రి పెద్దపల్లి నందు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలు జిల్లా కలెక్టర్, పెద్దపల్లి నేతృత్వంలో వారధి సొసైటీ ద్వారా మాత్రమే నిర్వహించబడతాయని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం కావాలనుకునే ఆశావహులు కలెక్టర్ కార్యాలయంలో ఉన్న వారధి సొసైటీలో నమోదు చేసుకోవచ్చనీ, మధ్యవర్తులు,దళారులు చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దనీ ,ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగితే నమ్మ వద్దని, జిల్లా ఆసుపత్రి పెద్దపల్లి సర్వదా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది ఎల్లప్పుడూ కృషి చేస్తూ ఉంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. క.శ్రీధర్ తెలిపారు.

## అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయ 24వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా అర్చక స్వాముల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా గణపతి హోమం, చండీ హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి అష్టాదశ కలశాభిషేక పూజలను అత్యంత వైభవంగా పూర్తి చేశారు. పట్టణ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, పర్యావరణం, ప్రజా ఆరోగ్యం మెరుగుపడాలని భగవంతుడిని ప్రార్థించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** జిల్లా స్థాయి జూనియర్ యువకుల బాక్సింగ్ ఎంపికలను ఈ నెల 19వ తేదీన కాగజ్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సిర్‌పిల్క్ ఎఫ్ కాలనీలో ఉదయం 8 గంటలకు ఈ ఎంపికలు ప్రారంభం కానున్నాయి. జూనియర్ విభాగంలో అండర్ 17కు 201011, అండర్ 19కు 200809 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో ప్రతిభ చూపిన వారు మార్చి 22 నుండి 24 వరకు హైదరాబాద్ షైక్‌పేట్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 91771 12942 నంబరును సంప్రదించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు వి. మధు, చైర్మన్ శివ నాయర్, ప్రధాన కార్యదర్శి ఎం. శేఖర్ పాల్గొన్నారు.

## కాసిపేట గనిపై ఏఐటీయుసి ధర్నా

**ప్రజాపక్షం / కాసిపేట :** సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాసిపేట 1వ గనిపై ఏఐటీయుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ కార్యదర్శి మీసుగు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గని మేనేజర్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. పాత పద్ధతిలోనే మెడికల్ బోర్డు కొనసాగించాలని, సొంతింటి పథకాన్ని త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్ను యాజమాన్యమే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మారు పేర్ల సమస్యను పరిష్కరించి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలనే అమలు చేయాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న శ్రీరాంపూర్ నుండి సేవ్ సింగరేణి ప్రచార జాతా ప్రారంభమవుతుందని, దీనికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎంఎల్ఏ కోనేనేని సాంబశివరావు, వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ హాజరవుతారని తెలిపారు. ఈ జాతా 30వ తేదీన కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముట్టడితో ముగుస్తుందని వివరించారు.


# గ్రామ అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయం

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



**ప్రజాపక్షం/తలమడుగు:** ఖోడద్ గ్రామ అభివృద్ధికి ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం తలమడుగు మండలంలోని ఖోడద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామం నుండి ఎదిగిన ఉద్యోగులు తమ ప్రాంతంపై మమకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంలో భాగంగా యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, సివిల్ సర్వీసెస్ వంటి పరీక్షలకు ఈ గ్రంథాలయం ఎంతో తోడ్పడుతుందని ఆకాంక్షించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎస్బీఐ, మిత్ర ఎన్జీఓ సహకారంతో సమకూర్చిన రూ.2 లక్షల విలువైన వైద్య పరికరాలను కలెక్టర్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనంతరం పశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశువైద్యశాలలో కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 3.38 లక్షల పశువులకు ఈ టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ అవగాహన ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపిడిఓ శంకర్, డిఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, ఎబీ రీజనల్ మేనేజర్ రామచంద్రరావు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో యువతరం



**ప్రజాపక్షం / రెబ్బన :** యువత మద్యం మత్తుకు బానిసవుతూ తమ బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకుంటున్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన వయసులో మద్యానికి బానిసలై తల్లిదండ్రులకు తీరని ఆవేదన మిగుల్చుతున్నారు. మారుతున్న సాంకేతిక యుగంలో విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన కొందరు యువకులు దారి తప్పి వ్యసనాల ఊబిలో కూరుకుపోతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా గ్రామాల్లో విచ్చలవిడిగా సాగుతున్న మద్యం అమ్మకాలు యువతను నిర్వీర్యం చేస్తున్నాయి.

### పల్లె గల్లీల్లో బెల్ట్ షాపుల జోరు

మండల కేంద్రాలకే పరిమితం కావాల్సిన మద్యం విక్రయాలు ఇప్పుడు పల్లె పల్లెకూ పాకాయి. గల్లీ నుంచి పల్లె వరకు బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. కొన్ని చోట్ల ఏకంగా వాహనాల ద్వారా మద్యం డోర్ డెలివరీ జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం సులభంగా అందుబాటులోకి రావడంతో స్కూల్ విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు ఈ వ్యసనానికి లోనవుతున్నారు. మద్యం మత్తులో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయి. ఇంటికి దీపమై అండగా ఉండాల్సిన కొడుకులు అకాల మరణం చెందుతుంటే తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

### కూలీల రెక్కల కష్టం మద్యం పాలు

ఒక సామాన్య కూలీ కుటుంబం నెలకు సంపాదించే ఆదాయంలో సింహభాగం మద్యం కోసమే ఖర్చవుతోంది. దీని వల్ల పిల్లల చదువులు ఆగిపోవడమే కాకుండా పౌష్టికాహారం లోపించి కుటుంబ సభ్యులు అనారోగ్యం పాలవుతున్నారు. మద్యం అలవాటు వల్ల శారీరకంగా కాలేయ వ్యాధులు మానసికంగా కుంగుబాటుకు గురవుతున్నారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. బెల్ట్ షాపులు నడపడం చట్టరీత్యా నేరమని తెలిసినా ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అక్రమ విక్రయాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి.

### కఠిన చర్యలు తీసుకోవాలి

మద్యం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. కేవలం ఆదాయమే పరమావధిగా కాకుండా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలి. బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేసి పల్లెలను మద్యం రహితంగా మార్చాలి.

### నా కొడుకును మద్యం బలితీసుకుంది

"రెక్కాడితే గానీ డొక్కాడని మా బతుకుల్లో నా కొడుకు ఓ వెలుగు నింపుతాడని ఆశపడ్డాను. కానీ ఊర్లోనే దొరుకుతున్న మద్యం నా కొడుకు ప్రాణాలను బలితీసుకుంది. మత్తులో బండి నడిపి యాక్సిడెంట్ చేసుకున్నాడు. ఇప్పుడు మాకు దిక్కు ఎవరూ లేరు. ప్రభుత్వం వెంటనే ఈ బెల్ట్ షాపులను మూయించాలి. ఏ తండ్రికీ నా గతి పట్టకూడదు. కనకయ్య, బాధిత తండ్రి, రెబ్బన.

## అడవిలో అగ్ని ప్రమాదాలతో పర్యావరణానికి ముప్పు

### డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్

**ప్రజాపక్షం / బెల్లంపల్లి / కాసిపేట :** అడవిలో అగ్ని ప్రమాదాల వల్ల వన్యప్రాణుల ఆవాసాలు దెబ్బతినడమే కాకుండా విలువైన వృక్ష సంపద కనుమరుగవుతుందని ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. బెల్లంపల్లి అటవీ క్షేత్రాధికారి ఆదేశాల మేరకు మంగళవారం ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని పెద్దాపూర్ కోలం గూడలో అటవీ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ రక్షణలో భాగంగా ఫైర్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్ బ్లోవర్లతో అదుపు చేస్తున్నామని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణలో ప్రజలు భాగస్వాములై చైతన్యం చూపాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 14వ వార్డు సభ్యులు మహేష్, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### జన్నారం ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్

**ప్రజాపక్షం / జన్నారం :** వేసవి కాలంలో సంభవించే అగ్ని ప్రమాదాల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జన్నారం ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ సూచించారు. జన్నారం మండలంలోని కలమడుగు వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు భయపడకుండా భద్రతా చర్యలు ఎలా తీసుకోవాలో వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో భవనాల నుండి క్షేమంగా బయటకు వచ్చే మార్గాలు, ఫైర్ పరికరాలను ఉపయోగించే విధానంపై విద్యార్థులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ గౌడ్, ఇన్చార్జి తిరుపతి, ఉపాధ్యాయులు, ఫైర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి

### ప్రిన్సిపల్ లక్ష్మణ్ పుట్ట



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:** ఆపదలో ఉన్నవారికి రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలని గిరిజన డిగ్రీ కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ లక్ష్మణ్ పుట్ట అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామంలో మంగళవారం గిరిజన డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ప్రిన్సిపల్ లక్ష్మణ్ పుట్ట మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదానంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీపిక మాట్లాడుతూ .. ఏజెన్సీ ప్రాంతాల్లో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తం ఎంతో అవసరమని తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులను, అత్యవసర స్థితిలో ఉన్న రోగులకు కాపాడటంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందని కళాశాల నర్సింగ్ ఆఫీసర్ సంకీర్త పేర్కొన్నారు. ఈ శిబిరంలో 40 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఎస్బీఐ రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ సత్యనారాయణ, మేనేజర్ బాలకృష్ణ, బ్రాంచ్ మేనేజర్ వంశీకరణ్ పాల్గొని రక్తదాతలకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, కళాశాల సిబ్బంది సురేందర్, లక్ష్మణ్, రామకృష్ణ, నాగరాజు, సంతోష్, ఉమాతాయి, గ్రామ సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలానికి చెందిన ఓ వ్యక్తికి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష విధించడం జరిగిందని నిజాంసాగర్ ఎస్సై జె.శివకుమార్ తెలిపారు. వెల్గనూరు గ్రామానికి చెందిన కుమ్మరి రవీందర్ మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో బాన్సువాడ రెండవ తరగతి మేజిస్ట్రేట్ 3 రోజులు జైలు శిక్షతో పాటు రూ 2000ల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఎవరు మద్యం సేవించి వాహనం నడిపినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## నవోదయా ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలకేంద్రంలోని జవహర్ నవోదయా విద్యాలయంలో 202627 విద్యా సంవత్సరానికి గాను 2025 డిసెంబర్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించగా అట్టి ఫలితాలు విడుదలైనట్లు పరీక్షల కేంద్రం ఇంచార్జ్ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూచించిన నవోదయా వెబ్సైట్‌లో రోల్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్ వివరాలు సమర్పించి ఫలితాలు చూసుకోవాలన్నారు.

## ప్రాథమిక స్థాయి ఎంపికకు హాజరుకావాలి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** హకీంపేట్ స్పోర్ట్స్ పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాల కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు నేడు మంగళవారం ఉదయం 9 గం.లకు జీహెచ్ఎస్ నిజాంసాగర్‌లో జరిగే మండలస్థాయి ప్రాథమిక ఎంపికకు హాజరుకావాలని మండల విద్యాశాఖ అధికారి వై.తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు తమ బర్త్ సర్టిఫికెట్, పాఠశాలలో అందించిన బోనాఫైడ్, ఆధార్‌కార్డు, 3వ తరగతి ప్రోగ్రెస్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, 2 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

## నేడు బంజపల్లి తైబజార్‌కు వేలంపాట

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్(బంజపల్లి) తైబజార్‌కు నేడు బుధవారం వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మంగళవారం సాయంత్రం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గ్రామ సర్పంచు అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం 10.30 గం.లకు వేలంపాట జరుగుతుందని, ఆసక్తి గల వారు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నజరుల్‌నగర్‌లో భక్తి శ్రద్ధలతో హరోబోల్ కీర్తన గానం

ప్రజాపక్షం / కాగజ్ నగర్ : కాగజ్ నగర్ మండలం నజరుల్‌నగర్ విలేజ్ నంబర్ 1లో బెంగాలీ సోదరులు హరోబోల్ కీర్తన, గంగా స్నాన కార్యక్రమాన్ని మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పి చైర్మన్ కోనేరు కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు గంగాస్నానం ఆచరించి హరినామ స్మరణతో కీర్తనలు గానం చేశారు. ఆ ధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఇవి కీలక పాత్ర పో షిస్తాయని తెలిపారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వేడుకలో గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సం ఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమ నిర్వాహకులు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి వేడుకను విజయవంతం చేశారు.

## సిర్పూర్ టి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

ప్రజాపక్షం / సిర్పూర్ టి : సిర్పూర్ టి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బావండ్లపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం న్యాయవాదుల సమక్షంలో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా గంట కల్యాణ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్షుడు బావండ్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమం, బార్ అసోసియేషన్ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సభ్యులందరి సహకారంతో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి గంట కల్యాణ్ పేర్కొన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

## కృత్రిమ గర్భధారణతో మేలుజాతి పశు సంతతి

ప్రజాపక్షం / జన్నారం : పశువులలో కృత్రిమ గర్భధారణ పద్ధతిని పాటించడం ద్వారా నాణ్యమైన మేలుజాతి పశు సంతతిని పొందవచ్చని తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గుగ్లావత్ సంగీత రవి నాయక్ తెలిపారు. మంగళవారం తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉచిత పశు గర్భకోశ వ్యాధి నివారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఉప సర్పంచ్ వేముల నాగేష్, గోపాలమిత్ర జిల్లా సూపర్వైజర్ ఆకుతోట రవితో కలిసి పాల్గొని పశువులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. గ్రామంలోని ఆవులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. చూడి పశువులకు అవసరమైన ఇంజక్షన్లు ఇచ్చి, మందులు పంపిణీ చేశారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పశువుల పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వాటిని ఎండ తగలకుండా నీడలో కట్టివేసి సమయానుకూలంగా నీటిని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర రాజన్న సాగర్, తాళ్లపల్లి రాజన్న, గ్రామ రైతులు పాల్గొన్నారు.



# ఆకుకూరలు, పోషకాహారంతో కంటి సమస్యలకు చెక్

### వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత



ప్రజాపక్షం / నస్పూర్ : ఆకుకూరలు, పోషకాహారం తీసుకోవడం ద్వారా కంటికి సంబంధించిన చిన్న చిన్న వ్యాధులను దూరం చేసుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత తెలిపారు. మంగళవారం నస్పూర్ మండలంలోని కెజిబివి పాఠశాల, కళాశాల విద్యార్థులకు నిర్వహించిన కంటి పరీక్షలకు కార్పొరేటర్ పుట్ట యశోదతో కలిసి ఆమె హాజరై 56 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో విటమిన్ ఏ లోపం కలగకుండా విటమిన్ ఏ సమృద్ధిగా లభించే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా దూరదృష్టి లోపం ఉన్న విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరీక్షల సమయంలో ఈ అద్దాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జాతీయ అంధత్వ నివారణ, ఆర్ బి ఎస్ కే కార్యక్రమం ద్వారా జిల్లాలో 165 మంది పిల్లలకు కంటి అద్దాలు మంజూరయ్యాయని వివరించారు. ఇదే వేదికపై బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ప్రిన్సిపాల్ మౌనిక, వైద్యులు డాక్టర్ వెంకటేష్, హరిప్రియ, జిల్లా నోడల్ అధికారి శంకర్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యవంతమైన సమాజం



ప్రజాపక్షం / నస్పూర్ : ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లో జాతీయ మిషన్ ఫర్ ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సాగులో సహజసిద్ధమైన సేంద్రియ ఎరువులు, పద్ధతులు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు సాధించవచ్చని సూచించారు. రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పదేళ్ల పాటు ప్రకృతి వ్యవసాయ సాగును ప్రోత్సహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 15 రైతువేదికల ద్వారా 1,875 మందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పథకం పురోగతికి పక్కాగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆత్మ చైర్మన్ సింగతి మురళీ, కార్పొరేటర్లు రాజన్న, బియ్యాల త్రివేణి, కమల, లగిశెట్టి రాజయ్య, రైతు కొట్టే రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు మేలు



ప్రజాపక్షం / మందమర్రి : రసాయనాలపై ఆధారపడకుండా సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా రైతులకు సాగు ఖర్చులు తగ్గుతాయని మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్మయి తెలిపారు. మందమర్రి మండలం సండ్రోయిన్‌పల్లి రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిలేపేట గ్రామానికి చెందిన జాతీయ సహజ వ్యవసాయ మిషన్ లబ్ధిదారులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సేంద్రియ కషాయాలను సొంతంగా తయారు చేసుకుని పంటలపై వినియోగించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన సందేశాన్ని రైతులు వీడియో ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, ఆదిలేపేట గ్రామ సర్పంచ్ నెందుగూరి పున్నం, రైతులు పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ తప్పనిసరి

### కె. హరిత, జిల్లా కలెక్టర్

ప్రజాపక్షం / తిర్యాణి : జిల్లాలో 9 నుండి 14 ఏళ్ల లోపు ఉన్న ప్రతి బాలికకు హెచ్‌పివి వ్యాక్సిన్ అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. మంగళవారం తిర్యాణి మండల కేంద్రంలోని చింతపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను నీతి ఆయోగ్ ప్రతినిధి అష్నా శర్మతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులు, ఆపరేషన్ థియేటర్, ప్రసూతి విభాగాలను పరిశీలించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలోని ఆర్‌ఓ ప్లాంట్‌ను వెంటనే మరమ్మత్తు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలికలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ వ్యాక్సిన్ ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. అనంతరం సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. మండలంలో వంద శాతం పశువులకు టీకాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలి

### కె. హరిత, జిల్లా కలెక్టర్

ప్రజాపక్షం / తిర్యాణి : పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. తిర్యాణి గ్రామ పంచాయతీలో మంగళవారం నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయాలని అధికారులను ఆదేశించారు. తిర్యాణి గ్రామంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 474 ఆవులు, గేదెలకు పశు వైద్యాధికారులు టీకాలు వేశారు. పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి నివారణకు టీకాలు వేయించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ యువ ప్రొఫెషనల్ అధికారి అష్నా శర్మ, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేముల మల్లేష్, ఉప సర్పంచ్ చైతి కుమార్, మండల పశు వైద్యాధికారి ఎస్. సాగర్, సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఎఎల్ఎంఎస్‌సి కమిటీ

ప్రజాపక్షం / పెంచికలపేట్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను పర్యవేక్షించేందుకు దరోగపల్లి గ్రామంలో అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ అండ్ సపోర్ట్ కమిటీ (ఏఎల్ఎంఎస్‌సి) ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బొట్టుపల్లి కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరై కమిటీ చైర్మన్, సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే సేవలు సమర్థవంతంగా అమలు కావడంలో ఈ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కేంద్రంలో పోషకాహారం పంపిణీ, పిల్లల హాజరు, ప్రీస్కూల్ విద్యా కార్యక్రమాల నిర్వహణను కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కమిటీ సభ్యులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

ప్రజాపక్షం / జన్నారం : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం జన్నారం తహసీల్దార్ రామ్మోహన్‌కు బిజెపి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా పేదలకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని ఆరోపించారు. ముఖ్యంగా రైతు భరోసా, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి కీలక వాగ్దానాలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన లబ్ధిదారులందరికీ ఆరు గ్యారెంటీలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. మండల, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్

జాపక్షం / కాగజ్ నగర్ : పేద ప్రజల కోసం శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ అందిస్తున్న ఉచిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ కోరారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి 29 మంది హాజరు కాగా, వారిలో 13 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ కొత్తపల్లి అనిత మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని హామీ ఇచ్చారు. గత మంగళవారం ఎంపికైన 18 మంది రోగులను సొసైటీ ఖర్చులతో రవాణా, భోజన సౌకర్యం కల్పించి ఆపరేషన్ కోసం నేడు బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రికి పంపించారు. గత తొమ్మిదేళ్లుగా వేలమందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించామని, లబ్ధి పొందిన వారు మరికొంతమందిని ప్రోత్సహించాలని డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆప్తమలజిస్ట్ శ్రీనాథ్, గోపి, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మందమర్రి మున్సిపాలిటీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాపక్షం / మందమర్రి : మందమర్రి పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళిక ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం రామన్ కాలనీ వద్ద గల రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పరిసరాల్లో విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ పనులను కమిషనర్ స్వయంగా పర్యవేక్షించారు. బ్రిడ్జ్ పరిసరాల్లో పేరుకుపోయిన దుమ్ము, చెత్తను సిబ్బంది సమన్వయంతో కుప్పలుగా చేర్చి యంత్రాల సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎం. గోపికృష్ణ, ఇంచార్జి జవాన్ మేకల నరేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యునికి డాక్టరేట్ పట్టా ప్రదానం

ప్రజాపక్షం/లక్ష్మణచందా : లక్ష్మణచందా మండలంలోని పొట్టపెల్లి కె గ్రామ వాస్తవ్యులు కీ.శే.పోతుగంటి పెద్దోళ్ల రాములుగంగవ్వ దంపతుల మూడవ కుమారుడు నరేష్ కుమార్ రాజనీతి శాస్త్ర విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రమణ పర్యవేక్షణలో "విద్యాహక్కు చట్టం,మహిళ సాధికారత పై దాని ప్రభావం " అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు గాను ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.నరేష్ కుమార్ ప్రస్తుతం నిర్మల్,మంచిర్యాల్ జిల్లాలలో జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యునిగా విధులు నిర్వహిస్తున్నారు.పిహెచ్ డి పరిశోధనలో తనకు సహకరించిన గురువులు,ప్రొఫెసర్లు,స్నేహితులు,బంధువులు, కుటుంబ సభ్యులకు డాక్టర్ నరేష్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.సాధారణ ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రారంభమైన తన విద్యా ప్రస్థానం నేడు ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందడం విశేషం.ఈ సందర్భంగా గ్రామస్థులు,స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

## హాస్టల్‌లో విద్యార్థుల ఆకలి కేకలు

ప్రజాపక్షం/బైంసా : బైంసా సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో విద్యార్థుల ఆకలి కేకలు మధ్యాహ్నం నుండి తిండి లేక విద్యార్థుల అవస్థలు పడ్డారు వాచ్మెన్ సునీల్ విద్యార్థుల వద్ద భోజనం కోసం 50 రూపాయల డిమాండ్ చేశారని విద్యార్థుల ఆరోపణ.ఏబీవీపీ కి సమాచారం ఇవ్వడంతో హాస్టల్ వార్డెన్ ను నిలదీసిన ఎబివిపి కార్యకర్తలు,హుటావిడిగా కూరగాయలు తెప్పించి రాత్రి 9 గంటలకు భోజనం తయారు చేశారు.వార్డెన్ శ్రీహరి అక్కడ అందరి కాళ్ళు మొక్కుతున్న వార్డెన్ క్షమాపణ కోరాడు.

## ఇవిఎం గోదాం తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : కలెక్టరేట సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లపూడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్, అధికారులు సర్వరాజ్,రాజశ్రీ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,మజార్,శ్రావణ్‌రెడ్డి ,రమేష్,ఎస్ఎన్‌రెడ్డి,రాజేశ్వర్, ఎస్. రమేష్ ,నరేష్అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలి

ప్రజాపక్షం/బైంసా : కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను నేరవేర్చడం లేదని తక్షణమే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని బైంసా మండల బిజెపి అధ్యక్షులు రాలు సిరం సుష్మరెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి సాయినాథ్ డిమాండ్ చేశారు.బిజెపి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ ఆదేశాను సారం మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి వినతి పత్రం అందించిన సందర్భంగా వారు మాట్లాడారు. యువమోర్చ నాయకులు ప్రసాద్,నాయకులు సత్యనారాయణ,అఖిల్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం / లక్షెట్టిపేట : ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలను పరిశీలించారు. ఎండాకాలం దృష్ట్యా ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని సూచించారు. అనంతరం వెంకట్రావుపేట, దౌడపల్లి, చందారం గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గ్రామాల్లో చెత్తను మురుగు కాలువల్లో వేసే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేలా అవగాహన కల్పించాలన్నారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో అమృత్ పథకం నీటి ట్యాంకుల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో కలిసి పరిశీలించి, వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థిని మృతికి అవినీతి అనకొండ గోవర్ధన్ విధానాలే కారణం

### ఓయుజెఏసీ అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్



ప్రజాపక్షం/నిర్మల్ : బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని మల్లిపూడి తేజస్వనీ మృతికి కారణం యూనివర్సిటీ యాజమాన్యమే తనకు సకాలంలో ట్రీట్ మెంట్ అందించడంలో యూనివర్సిటీ యంత్రాంగం విఫలం అయ్యింది.తాను ఇబ్బంది పడుతూ హెల్త్ సెంటర్ కు పోతే ఇబ్బందినీ గమనించకుండా మంచి ట్రీట్మెంట్ కోసం పెద్ద హాస్పిటల్ కు తీసుకెళ్లి వైద్యం అందించాలి అనే సోయి లేని వీసీ గోవర్ధన్ టెక్ ఫెస్ట్ లలో ఫోటోలు వైరల్ చేసుకుంటూ నిండు ప్రాణాన్ని బలిగొన్నడు సకాలంలో పెద్ద హాస్పిటల్ కు తరలించి వైద్యం అందిస్తే విలువైన ప్రాణం కాపాడే వాళ్ళం,వ్యక్తిగత లబ్ధి,డబ్బుల సంపాదన పక్కన పెట్టి వీసీ విద్యార్థులు ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయ్యాలి మెరుగైన స్థాయిలో వైద్యం అందించే పరికరాలు ముఖ్యంగా డాక్టర్లను అందుబాటులో ఉంచాలి."ప్రయోజకులు అవుదామని బాసర ట్రిపుల్ ఐటీకీ వస్తె శవలుగా మారి ఇంటికి వెళ్లడం అత్యంత దురదృష్ట కరంవిద్యార్థుల ప్రాణాలు కాపాడండి అలాగే మరణించిన విద్యార్థిని మల్లిపూడి తేజస్వనీ కుటుంబానికి యాభై లక్షల రూపాయల ఎక్స్‌గ్రేసియా బాసర ట్రిపుల ఐటి యాజమాన్యం ప్రకటించాలని డిమాండు చేస్తున్నం విద్యార్థిని మృతికి ఇంచార్జీ వీసీ గోవర్ధన్ విధానాలే కారణం,యూనివర్సిటీని నడపడం చేతకాక పోతే అవినీతి చక్రవర్తి గోవర్ధన్ వెంటనే రాజీనామా చేయాలి తనకు ముడుపులు ఇచ్చి మెస్ కాంట్రాక్టులు తీసుకున్న వారికి రక్షణ కోసం డైలీ చక్కర్లు కొట్టే ఇంచార్జీ వీసీ గోవర్ధన్ కు విద్యార్థులకు సరియైన ట్రీట్మెంట్ అందించాలని గానీ వారి మరణాల మీద ఎందుకు పట్టింపు లేదో సమాధానం చెప్పాలి నీ ముసుగు తొందర్లోనే తొలగిస్తాం బాసర ట్రిపుల్ ఐటీనీ కాపాడుకుంటాం ప్రకటనలో ఓయుజెఏసి అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్ హెచ్చరించారు.

## ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించిన బిజెపి నాయకులు



ప్రజాపక్షం/బైంసా : భారతీయ జనతా పార్టీ బైంసా పట్టణ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పిలుపుమేరకు ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ముఖ్య ఉద్దేశం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 27 నెలలు గడుస్తున్న కూడా ఇప్పటివరకు ఇచిచన హామీలు నెరవేర్చలేదు రైతుబంధు,లేదు రైతు భరోసా లేదు రైతు భీమా లేదు వృద్ధాప్త వితంతువులకి,వికలాంగులకి దివ్యాంగులకి ఇప్పటివరకు మీరు ఇస్తా మన్న డబ్బులు ఇవ్వలేదు మహిళలకు స్కూటీలు లేవు నిరుద్యోగ భృతి లేదు,తులం బంగారం ,వరి పై 500 బోనస్,ఇలా చేసుకుంటూ పోతే చాలా హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావడం జరిగింది.తెలంగాణ ప్రజల,రైతుల రక్తాన్ని తాగుతున్న పార్టీ ఏదైనా ఉందా అంటే అది కాంగ్రెస్ పార్టీ అలాంటి పార్టీని రాబోయే ఎలక్షన్లో గద్దెను దించి మన రైతుల కోసం ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడే పార్టీ బిజెపి కట్టం కట్టి రైతే రాజు అనే నినాదంతో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుంది.ఈ కార్యక్రమంలో బిజెపి టౌన్ అధ్యక్షుడు రావుల రాము,నిర్మల్ జిల్లా సెక్రెటరీ తాడేవారు సాయినాథ్ జిల్లా ఉపాధ్యక్షుడు గాలి రవి కౌన్సిలర్ నిమ్మల ప్రవీణ్ చింతపండు మహేష్ కౌన్సిలర్ డి.శ్రీకాంత్ కౌన్సిలర్ చర్ల సుభాష్ కౌన్సిలర్ అల్లెం దిలీప్ తోట రాజు హనుమడ్లు గాడి సురేష్ కార్తీక్ కిసాన్ మోర్చా అధ్యక్షుడు నడిమిశెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## అసైన్డ్ భూముల్లో అక్రమ వ్యాపారాలు చేస్తే పట్టాల రద్దు

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు.తానూర్ మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులు తమకు కేటాయించిన ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో సాగు చేయకుండా వాటిని ఇతర వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చినట్లు ఆమె తెలిపారు.ముఖ్యంగా కొందరు మొరం వ్యాపారం సాగిస్తున్నట్లు విచారణలో తెలిందన్నారు.ఈ నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తులను గుర్తించి,వారి పేరిట ఉన్న పట్టాలను తక్షణమే రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ప్రభుత్వ అసైన్డ్ భూములను అర్హులైన పేదలు సాగు నిమిత్తం మాత్రమే వినియోగించుకోవాలని,వాటిని ఇతరులకు విక్రయించడం లేదా వాణిజ్య అవసరాలకు మళ్లించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ కొనసాగిస్తారని,ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలితే వారి పట్టాలను రద్దు చేసి భూములను ప్రభుత్వానికి తిరిగి స్వాధీనం చేసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

## ఆర్కే-7 గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో బాయిబాట కార్యక్రమం చేపట్టినట్లు ఆ యూనియన్ సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు తెలిపారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కె 7 గనిలో పర్యటించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టబ్ రిపేర్ సెక్షన్‌లో నాణ్యమైన డాబర్ పట్టీలు సరఫరా చేయాలని, కాలం చెల్లిన టబ్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టైండాల వారికి కొత్త చైన్ బ్లాక్స్, ట్రామర్లకు వార్మ్ కోట్స్ అందించాలని కోరారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్లకు హెల్పర్లను నియమించాలని, టెక్నీషియన్ల కొరతను భర్తీ చేస్తూ ఏరియా ఫిక్సేషన్ కల్పించాలని పేర్కొన్నారు. జన్మభూమి పేరుతో కార్మిక శ్రమ దోపిడీని నిలిపివేయాలని, పని భారం తగ్గించి అవసరమైన పనిముట్లు సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను గని మేనేజర్‌కు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గరిగస్వామి, తిరుపతి రాజు, పేరం రమేష్, అశోక్, మనోజ్, రౌతు సత్యనారాయణ, బోలిశెట్టి శ్రీకాంత్, ప్రణయ్ కుమార్, కార్తీక్ రెడ్డి, విజయ్, బెల్లం తిరుపతి, వాసం అజయ్, కొట్టె అజయ్, సురేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్‌కు రైతుల ఉసురుతగులుతుంది

### ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్

ప్రజాపక్షం/బైంసా : ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ కు రైతుల ఉసురు తగులుతుందని ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు.మంగళవారం హైదరాబాద్‌లో అసెంబ్లీ ఆవరణలో బిజెపి ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల తో కలిసి నిరసన తెలిపిన సంపూర్ణ రుణ మాఫీ చేయడంతో పాటు రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముధోల్ నియోజకవర్గంలో మొక్క జొన్న రైతులకు తక్షణమే నష్ట పరిహారం ఇవ్వాలన్నారు.రైతుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బిజెపి పోరాటం చేస్తుందన్నారు.

## దవాఖానలో డాక్టర్ నియమించండి

ప్రజాపక్షం/సారంగాపూర్ : మండలంలోని చించోలి బి గ్రామంలోని పల్లె దవాఖానాలో దాదాపు ఒక సంవత్సర కాలం నుండి డాక్టర్ లేక ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు.దాదాపు 3000 జనాభా కలిగిన గ్రామంలో డాక్టర్ లేకపోవడం తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా వైద్యాధికారి డా.రాజేందర్ ను కలిసి డాక్టర్ ని నియమించాలని వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు బత్తుల రంజిత్,జిల్లా కన్వీనర్ కొంతం మురళీధర్,గ్రామ యువకులు ఆడెపు నరేష్,కొంతం ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్‌లో ప్రజా పాలన గ్రామసభ

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలోని 99 రోజుల ప్రజాపాలన పల్లె ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ద డిగే జయలలిత భోజన్న అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారుప్రజాపాలన 99 రోజుల కార్యక్రమం అవగాహన చేయడం జరిగిందని అలాగే మల్లీ పర్పస్ వర్కర్లను సన్మానం చేయడం జరిగిందని మెడికల్ కిట్స్ అందజేయడం జరిగిందని అనంతరం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయినాథ్ పంచాయతీ కార్యదర్శి రాజు అంగన్వాడీ టీచర్లు ఐకెపి వివోలు పాల్గొన్నారు.

## హామీల అమలు కోసం తహసీల్దార్‌కి వినతి పత్రం

ప్రజాపక్షం/మామడ : మామడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ కి బిజెపి మండల శాఖ మండల అధ్యక్షుని ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది..అధ్యక్షుడు బత్తుల రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల పాలనలో ఇప్పటి వరకు ఆరు గ్యారంటీలను,6 గ్యారంటీలు హామీలకు ఈ బడ్జెట్ లోనైనా నిధులు కేటాయించాలని ఆదేవిధంగా రైతులకు ఇస్తా అన్నటువంటి రైతుభరోసా,వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం కోసం కూడా వెంటనే నిధులు ఇచ్చి రైతులను ఆదుకోవాలని లక్క వెంకటరమణ,మండల ఉపాధ్యక్షుడు లక్ష్మి, చిన్నారెడ్డి,పందిరి మల్లయ్య సర్పంచ్ ఆరెపెల్లి,రాజేశ్వర్ కొరటికల్ సర్పంచ్,సచిన్ బందల ఖానాపూర్ సర్పంచ్,జె.బంక తిరుపతి సర్పంచ్ రామదారి కొర్రి రాజేశ్వర్‌లు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/బాల్కొండ :** జడ్పీహెచ్ఎస్ బాల్కొండ విద్యార్థులకు బూట్లు, టై బెల్ట్‌లు, టీషర్ట్‌లను సరఫరా చేయటం కోసం బృహస్పతి టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థలో పని చేస్తున్న జడ్పీహెచ్ఎస్ బాల్కొండకు చెందిన ఠాకూర్ అరవింద్ సింగ్ కుమార్తె ఠాకూర్ అమృత ద్వారా సీఎస్ఆర్ కింద రూ.3,45,600 ల ఆర్థిక సాయం మంజూరైనందుకు ప్రతిష్టాత్మక సంస్థ అయిన బృహస్పతి టెక్నాలజీ సంస్థకు 'కార్పోరల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం పాఠశాలకు సాయమందించడానికి ముందుకొచ్చినందుకు ఎంఈఓ బట్టు రాజేశ్వర్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్ ఆర్థిక సాయం అందించడంలో కృషి చేసిన ఠాకూర్ అరవింద్‌సింగ్‌కు ఆయన కుమార్తె సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఠాకూర్ అమృతలత అభినందనలు తెలిపారు.

## ఇచ్చిన గ్యారంటీలను నెరవేర్చాలి



**ప్రజాపక్షం/మాక్లూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల తహసీల్దార్ రాజశేఖర్‌కు మంగళవారం వినతిపత్రం అందించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ ఆరు గ్యారెంటీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ కాలం గడుపుతుందని తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సాధ్యం కానీ హామీలతో గద్దెనెక్కిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రేవంత్ సర్కార్ రాష్ట్రమంతా రాక్షస పాలన సాగిస్తుందన్నారు. తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతులతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మదారి మమత, సర్పంచ్ ధర్మపతి, రాజేశ్వర్, సురేష్‌నాయక్, రమేష్, రాజు, ప్రతాప్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## పట్టుకున్న ఇసుక కుప్పల వేలం

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని గాండ్లపాడు గ్రామంలో సీజ్ చేసిన ఇసుక కుప్పలకు ఓపెన్ యాక్షన్ నిర్వహించారు. 70 ట్రిప్పుల ఇసుక కుప్పలకు నిర్వహించిన ఈ వేలంలో ముగ్గురు పాల్గొనగా మోర్తాడ్‌కు చెందిన పల్లపు రాజేశ్వర్ రూ. 1,49,302 లకు పాట పాడి వేలంలో ఇసుకను దక్కించుకున్నారు. ఈ వేలం పాటను కలెక్టర్ ఆదేశాల ప్రకారం సాండ్ సోసైటీ నిజామాబాద్ పేరున డీడీ రూపంలో జమ చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. మోర్తాడ్ తహసీల్దార్ కృష్ణ, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ రంజిత్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నిర్మల్ ఆర్డీ కార్యాలయం ముందు ఆశా వర్కర్ల ధర్నా

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** తమ సమస్యలను పరిష్కరించి కనీస వేతనం 18,000 రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆశా వర్కర్లు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన 48 గంటల ధర్నాలో భాగంగా,నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఉన్న ధర్నా చౌక్ వద్ద ఆశా వర్కర్లు ఉధృతంగా పోరాటం నిర్వహించారు.మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా,వేడెక్కిన రోడ్డుపైనే సుమారు గంటపాటు ఆశా వర్కర్లు బైఠాయించి నిరసన తెలిపారు.దీనివల్ల ప్రధాన రహదారిపై సుమారు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచి పోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల పట్ల అత్యంత మొండి వైఖరి అవలంభిస్తోందని మండిపడ్డారు.సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి వర్కర్‌కు 26,000 రూపాలయల కనీస వేతనం అందించాలని,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో 18,000 రూపాయల ఫిక్స్‌డ్ వేతనాన్ని తక్షణమే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.సమాజ ఆరోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు గణనీయమైన పాత్ర పోషిస్తున్నప్పటికీ,ప్రభుత్వం వారిని పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక



ముందు తమ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు కనీస వేతనం,పని భద్రత,రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని,కానీ అధికారంలోకి వచ్చాక ఆహామీలను తుంగలో తొక్కిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే,రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున యుద్ధం ప్రకటిస్తామని ఆయన హెచ్చరించారు.అ ఆందోళన కార్యక్రమానికి అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శైలజ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆశా వర్కర్ల పోరాటానికి సంఘీభావం తెలిపారు.ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.సుజాత,కార్యదర్శి పి.గంగామణి,ఉపాధ్యక్షులు విజయ,చంద్రకళ, ఇం ద్రమ్మ, నంద.సుగ్న,పద్మతో పాటు సహాయ కార్యదర్శులు కమల, రామలక్ష్మి ,మంగ,శ్యామల,సులోచన,అనసూయ, జ్యోతి, వినోద్ పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని అక్రమిస్తే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు.ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఈ విషయం తెలిపారు.పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములపై కొందరు వ్యక్తులు అక్రమంగా కన్నేసి నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు పొందినట్లు అధికారుల దృష్టికి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.దీనిపై రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు.నిబంధనలకు విరుద్ధంగా పొందిన పట్టాలను తక్షణమే రద్దు చేసినట్లు వెల్లడించారు.అలాగే ఆక్రమణకు గురైన భూమిని రెవెన్యూ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకుని పారిశ్రామిక శాఖకు అప్పగించినట్లు తెలిపారు.ప్రభుత్వ భూమి



ప్రజల ఆస్తి అని,దానినిన అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.ఆక్రమణదారులపై కచ్చితంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ భూములపై ఆక్రమణలు జరగకుండా నిరంతరం నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు.ఎక్కడైనా ఆక్రమాలు జరిగితే ప్రజలు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు.

## కవితారెడ్డిని సన్మానించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్

**ప్రజాపక్షం/నిజామాబాద్:** ఇండియన్ ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీరించిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కవితారెడ్డిని మంగళవారం నగరంలోని ఆమె స్వగృహంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిజామాబాద్ శాఖ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా డాక్టర్ కవితారెడ్డికి పూలమొక్కను అందజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఐఎంఎ నిజామాబాద్ అధ్యక్షులు డాక్టర్ ఆకుల విశాల్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ హరీష్ స్వామి మాట్లాడుతూ డాక్టర్ కవితరెడ్డిని ఇండియన్ ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించటం నిజామాబాద్ జిల్లా వైద్య వృత్తికి గర్వకారణమని కొనియా



డారు. కార్యక్రమంలో నేషనల్ నియోనటాలజీ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.శ్రీశైలం, ఎఎస్పై రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ టి.జీవన్‌రావు, డాక్టర్ రమనేశ్వర్, సీనియర్ వైద్యులు డీఎల్ఎన్ స్వామి, వినోద్‌కుమార్‌గుప్తా, అరవింద్‌రెడ్డి, తానా అధ్యక్షులు డాక్టర్ నవీన్ వైద్యులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్:** కళ్యాణలక్ష్మీ పథకం ఆడ బిడ్డల పెళ్లిళ్లకు వరాలంటూ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామంలో చెక్కులను గ్రామపంచాయతీలో సర్పంచ్ కొడిగెల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో దేవరశెట్టి సులోచన, మధ సుభద్ర, దడ్డు లక్ష్మీ , తిమ్మాపురం లక్ష్మీలకు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కళ్యాణలక్ష్మీ పథకం నిరుపేదల ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఎంతో అండగా, వరాలుగా ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సిఎం రేవంత్ రెడ్డికి చెక్కుల పంపిణీకి కృషి చేసిన ఇన్‌చార్జి సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాశెట్టి రమేష్, వార్డు సభ్యులు వికాస్, నాయకులు లింబాద్రి, రాజు, అవినాష్ పాల్గొన్నారు.



## ఆట వస్తువులు వితరణ

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ లయన్స్ క్లబ్ మంగళవారం నిజామాబాద్ కోటగల్లిలోని సరస్వతి శిశుమందిర్‌కు రూ. 45 వేల విలువచేసే ఆట వస్తువులను లయన్స్ విజయ్ కుమార్ వితరణ చేశారు. 95 మంది విద్యార్థులు శిశుమందిర్ పాఠశాలలో చదువుతున్నారు. చిన్న పిల్లలకు వీటిని అందజేసి మేలు చేశారని యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో నందిపేట్ లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## రంజాన్ బహుమానం అందజేత

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలో మంగళవారం రంజాన్ పండుగ సందర్భంగా బహుమతులు ఆయా గ్రామ సర్పంచ్‌లు ముస్లింలకు అందజేశారు. అయిలాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ మీసాల లక్ష్మి నారాయణ, ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షులు సుదర్శన్‌లు బహుమతులు అందజేశారు.

## విద్యార్థులకు యూనిఫామ్, టై, షూల పంపిణీ

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని నాగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఉచిత యూనిఫామ్‌లు, టై, బెల్ట్, బూట్ల పంపిణీని ఘనంగా నిర్వహించామని ఎంఈఓ రాజేశ్వర్ తెలిపారు. చిన్నారి విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సమానత్వ భావన పెంపొందించేందుకు యూనిఫామ్‌లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రజాప్రతినిధుల సహకారంత చాలా అవసరమని రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవికుమార్, కృష్ణవేణి. సర్పంచ్ హేమలత లక్ష్మి నారాయణ, ఉపసర్పంచ్ నర్సయ్య, చైర్మన్ ఆరెపల్లి లక్ష్మీ , గంగానర్సయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన ఈరవత్రి అనిల్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులోని చిన్నారులను చూసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఈరవత్రి అనిల్ వారికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారన్నారు. బాధలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి చిన్నారుల భవిష్యత్తు కోసం చేయూతనందించిన అనిల్ ఈరవత్రికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్రబాబు, మండల అధ్యక్షులు బోదిరె స్వామి, పట్టణ అధ్యక్షులు జెజె నర్సయ్య, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు పర్స అనంతరావు, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, కౌన్సిలర్లు సతీష్, అంజుమ్, సందీప్, నాయకులు సుంకరి సురేష్, గంగాధర్, చిన్నగంగయ్య, శ్రీనివాస్, దినేష్, సాయమ్మ పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత టీకాల పంపిణీ

**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని గుంజిలి, గొట్టుముక్కుల, వేణు కిషన్ తండా గ్రామాల్లో పశువుల్లో వ్యాపించే ఫుట్ అండ్ మౌత్ డిసీజ్(ఎఫ్ఎండి) నివారణ కోసం టీకాల కార్యక్రమాన్ని మాక్లూర్ పశు వైద్యులు డాక్టర్ ఉమామాసాహెర్ ఆధ్వర్యంలో ఉచిత టీకాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ వ్యాధి తీవ్రతతో పశువులను తీవ్రమైన అంటువ్యాధి అయిన ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ నుండి రక్షించేందుకు ఈ టీకాలు వేయటంజరుగుతుందని తెలిపారు. రైతులు తమ పశువులకు సమయానికి టీకాలు వేయించుకోవాలని పశువుల ఆరోగ్యాన్ని కాపాడాలని పశు రైతులకు సూచించారు. కార్యక్రమంలో వినీత (వీఎల్ఓ), కళ్యాణి (జెవీఓ), గంగాధర్, పుష్ప, శ్యామల, సికిందర్, గోపాల మిత్ర సుధీర్, రైతులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్‌లో పాల్గొన్న సిపి

**ప్రజాపక్షం/భీమ్‌గల్:** బాల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జమా మసీద్‌లో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీ సాయిచైతన్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రార్థనల్లో, దువాలో పాల్గొని ఉపవాస విరమణ చేశారు. కార్యక్రమంలో సిఐ, ఎస్సైలు జాన్‌రెడ్డి, శైలందర్, మైనార్టీ నాయకులు మజారుద్దీన్, సయ్యద్ రియాజుద్దీన్, ఎండి.అక్బర్ , ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

